క్లుప్తంగా

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



ఎర్రవల్లిచౌరస్తా: అభివృద్ధి పనులపై అధికారులు నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీపీ స్నేహా హెచ్చరించారు. ఇటిక్యాల మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఆర్థిక సంఘం నిధులు, జనరల్ నిధులతో పాటు ఆయా గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్య వహించొద్దన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతోనే పల్లెల ప్రగతి సాధ్యమన్నారు. సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకు మాత్రమే అందేలా చూడాలని అధికారులకు సూచించారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వ పెద్ద పీట వేస్తోందన్నారు. గ్రామాల్లో గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నార. సభలో ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజా ప్రతినిధులు ఎంపీపీ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుజాత, ఎంపీడీవో రాఘవ, డీటీ నందిని, విద్యుత్ ఏఈ వెంకటేశ్వరావు, ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు

వీపనగండ్ల: రైతులు వరిధాన్యాన్ని పండించి నిబంధనల ప్రకారం ఆరబెట్టినా.. సకాలంలో కొనుగోలు చేయడం లేదని రైతు సంఘం మండల ఉపాధ్యక్షుడు శేఖర్‌రెడ్డి అన్నారు. గోపల్‌దిన్నె, వీపనగండ్ల, తదితర గ్రామాల్లో 15 రోజులుగా ఆరబెట్టిన వరిధాన్యం సరైన మ్యాచర్ వచ్చినా కాంటా వేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆయన కోరారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద మంగళవారం పంచాయతీ కార్యదర్శులు ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరిస్తూ ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు నిరంతరాయంగా గ్రామాల అభివృద్ధి కోసం పనిచేస్తున్న తమ సమస్యలను తీర్చేందుకు చర్యలు తీసుకోవడం ఆనందం కలిగించిందన్నారు. ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రి కేసీఆర్, వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

పెండింగ్ కూలి చెల్లించాలని వినతి



పాన్‌గల్: ఉపాధి పనులకు సంబంధించిన కూలీ డబ్బులు రెగ్యులర్‌గా అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, కూలీ డబ్బులు త్వరగా అందించాలని ఉపాధి కూలీలు అధికారులకు మొర పెట్టుకున్నారు. మంగళవారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో చెరువులో ఒండ్రు మట్టి తరలింపు పనులను ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, ఎంపీఓ రఘురాములు పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు కూలీలు తమ ఇబ్బందులను అధికారులకు విన్నవించారు. ఎనిమిది వారాల కూలీ డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయని, దీంతో ఇబ్బందులు తప్పడం లేదని, కూలీ కూడా గిట్టుబాటు కావడం లేదని వాపోయారు. పనులు జరిగే ప్రాంతంలో సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నామని కూలీలు అధికారులకు వివరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని అధికారులు కూలీలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ శాంతమ్మ, పంచాయతీ కార్యదర్శి నర్మద పాల్గొన్నారు.

కళాశాల ఏర్పాటుపై వినతి

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని నోడల్ అధికారి వెంకటరమణకు బీజేపీ నాయకులు మంగళవారం వినతి అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు భీమేష్ మాట్లాడారు. 15 సంవత్సరాల నుంచి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అవుతున్నారని అన్నారు. కృష్ణయ్య, మల్లేష్, శ్రీకాంత్ రెడ్డి, మార్కండేయ, రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే స్వచ్ఛత

- మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్
- శానిటేషన్ వారోత్సవాలు ప్రారంభం



వనపర్తిలో బ్లీచింగ్ చలుతున్న మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్

వనపర్తి టౌన్: పట్టణ ప్రజల సహకారంతోనే సంపూర్ణ పరిశుభ్రత సాధ్యమవుతుందని మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని 23వ వార్డులో పట్టణ శానిటేషన్ వారోత్సవాల్లో భాగంగా శానిటేషన్ డ్రైవ్‌ను కౌన్సిలర్ భువనేశ్వరితో కలిసి నిర్వహించారు. ఈ మేరకు డ్రెయినేజీలు శుభ్రపరిచి బ్లీచింగ్ చల్లారు. గుంతలు పడిన రోడ్లను మట్టితో పూడ్చడంతో పాటు స్వీపింగ్ చేయించినట్లు, చెట్ల కత్తిరింపు పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ గట్టుయాదవ్ మాట్లాడుతూ.. వనపర్తిని పారిశుద్ధ్యంలో ముందుంచడానికి పట్టణ ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఇళ్లు, వాకిళ్లను ఎలా శుభ్రపరుచుకుంటామో వీధులను సైతం అలానే శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వీధుల్లో ఏమైనా శానిటేషన్ సమస్యలు ఉంటే వార్డు కౌన్సిలర్ల దృష్టికి తీసుకెళ్లాలని, అప్పటికీ సమస్య పరిష్కాం కాకపోతే తన దృష్టికి తీసుకురావాలన్నారు. వీధుల్లో కార్యక్రమాలు ఏర్పాటు చేసి శానిటేషన్‌పై అవగాహన కల్పించినప్పుడే కాకుండా వీలునప్పుడల్లా వీధులను శుభ్రపరుచుకోవడానికి కృషి చేయాలని కోరారు. శానిటేషన్ పని కేవలం పారిశుద్ధ్య కార్మికులదే అన్నట్లు కాకుండా అందరి బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ఇంట్లో చెత్తను రోడ్ల పై వేయకుండా చెత్త ట్రాక్టర్‌కు అందించి పట్టణ పరిశుభ్రతకు పాటుపడాలన్నారు. రాబోయే రోజుల్లో ఎండాకాలం పూర్తయిన వెంటనే మారుతున్న కాలానికి సీజనల్ వ్యాధులు అధికంగా ప్రబలే పరిస్థితుల్లో ఇంటిని, నీటి శుభ్రపరుచుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోతే దోమల వ్యాప్తి పెరిగి రోగాల బారిన పడాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పాకనాటి కృష్ణ, తిరుమల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

వీపనగండ్ల దళితవాడలో..



వీపనగండ్ల దళితవాడలో..

వీపనగండ్ల: మండల కేంద్రంలోని దళితవాడలో మంగళవారం ఎంపీడీఓ కతలప్ప, సర్పంచ్ నర్సింహారెడ్డి పారిశుద్ధ్య పనులు ప్రారంభించారు. ఎన్నో రోజులుగా ఏపుగా పెరిగిన ముళ్ల చెట్లను జేసీబీ ద్వారా తొలగించి దళితవాడలోని గృహాల మధ్య ఉన్న స్థలాన్ని శుభ్రం చేశారు. దళితవాడలో పారిశుద్ధ్య పనులు చేపట్టి శుభ్రం చేయడం ఎంతో ఆనందించదగ్గ విషయం అని ప్రజలు అన్నారు. శుభ్రం చేసిన స్థలంలో పార్కును కానీ, ఫంక్షన్ హాల్ కానీ నిర్మించి వినియోగంలోకి తీసుకురావాలని వారు కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విపక్ష కౌన్సిలర్ల వార్డులపై వివక్ష తగదు



మాట్లాడుతున్న విజయరాములు

అమరచింత: సీసీ రోడ్ల మంజూరు, అభివృద్ధి పనుల పూర్తి చేయడం విషయంలో విపక్ష కౌన్సిలర్లు ఉన్న వార్డులపై మున్సిపల్ చైర్‌పర్సన్, అధికార పార్టీ కౌన్సిలర్లు వివక్ష చూపుతున్నారని మూడో వార్డు కౌన్సిలర్, సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు ఆరోపించారు. పట్టణంలోని మూడో వార్డులో సీసీ రహదారి పేరిట రహదారిని చదును చేసి వదిలేసిన కాలనీని సీపీఐ బృందంతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ కౌన్సిలర్ ఉన్న వార్డుకు వెయ్యి మీటర్లు సీసీ రోడ్డు మంజూరు చేస్తే విపక్ష కౌన్సిలర్ గెలిచిన రెండు, మూడు, నాలుగు వార్డులకు కలిపి వెయ్యి మీటర్లు సైతం మంజూరు చేయలేదని ఆరోపించారు. విపక్ష కౌన్సిలర్ల మధ్య తగాదా పెట్టాలన్నది అధికార పార్టీ దురుద్దేశమని విమర్శించారు. మూడో వార్డులో తనకు తెలియకుండా డీఈ, కాంట్రాక్టర్, అధికార పార్టీ నాయకులు కలిసి రోడ్డు వేస్తామని చదును చేయించారన్నారు. మే 13న రహదారి పనుల కోసం మెటీరియల్ ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్ 10 రోజులవుతున్నా ఇప్పటికీ పనులు చేపట్టకపోవడం దారుణమన్నారు. పనులను ఎందుకు ప్రారంభించడం లేదని డీఈ, కాంట్రాక్టర్‌ను ప్రశ్నిస్తే వారిని కౌన్సిలర్ బెదిరించాడని దుష్ప్రచారం చేస్తున్నారని వాపోయారు. సీపీఐ నుంచి మూడో వార్డు కౌన్సిలర్‌గా ప్రజలు గెలిపించారని, వార్డులో జరగాల్సిన అభివృద్ధి పనులను అధికార పార్టీ కౌన్సిలర్లు, నాయకులు అడ్డుకోవడం, మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త కాంట్రాక్టర్‌కు మద్దతు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా వార్డులో మంజూరు ప్రకారం సీసీ రహదారులను నిర్మించాలని, లేని పక్షంలో ప్రజలతో కలిసి ప్రజా ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి అబ్రహం, పట్టణ కార్యదర్శి భాస్కర్, శ్యాంసుందర్, కుతుబ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం



పారిశుద్ధ్య కార్మికుల సన్మానిస్తున్న ఎంపీడీఓ, సర్పంచ్

పాన్‌గల్: ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగంగా గ్రామంలో ఈనెల 17వ తేదీ నుంచి వారం రోజులు పాటు చేపట్టిన పారిశుద్ధ్య కార్యక్రమాలకు గుర్తింపుగా మండలంలోని తెల్లరాళ్లపల్లితండా సర్పంచ్ శాంతమ్మ ఆధ్వర్యంలో మంగళవారం తండా పారిశుద్ధ్య కార్మికులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే రోగాలకు దూరంగా ఉండవచ్చన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా మార్చే వీలుంటుందని తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నివారణలో కార్మికుల పాత్ర ఎంతో కీలకమైందన్నారు. వారి సేవలకు గుర్తింపుగా ఇలాంటి సన్మానాలు చేయడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీఓ రఘురాములు, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్, పంచాయతీ కార్యదర్శి నర్మద, తండా వాసులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో వీఏఏల నిరసన



కొల్లాపూర్: నల్లబ్యాడ్జీలు ధరించి వీఏఏలు సమ్మె శిబిరంలో కూర్చున్నారు. తమ డిమాండ్ల సాధనకు చేపట్టిన కలెక్టరేట్ ముట్టడిలో వీఏఏలపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని నిరసిస్తూ.. నల్లబ్యాడ్జీలు ధరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలని డిమాండ్ చేశారు. పానుగంటి నర్సింహ, అలివేలమ్మ, అమీన్‌పాష, చంద్రకళ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన అవసరం



గోపాల్‌పేట తహసీల్దార్ సునీతకు వినతిపత్రం అందిస్తున్న డీఎస్పీ నాయకులు

పాన్‌గల్: ప్రతి పౌరుడికి భారత రాజ్యాంగ గ్రంథాన్ని అందించాలని కోరుతూ ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఇన్‌చార్జ్ తహసీల్దార్ చక్రపాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధర్మ సమాజ్ పార్టీ మండల ప్రచార కమిటీ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ మాట్లాడారు. ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర నాయకులు డా.విశారధన్ మహారాజ్ ఆదేశానుసారం ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. భారత రాజ్యాంగ గ్రంథాన్ని పంపిణీపై గతంలో కలెక్టర్, తహసీల్దార్లకు వినతిపత్రాలను అందజేసిన స్పందన లేదన్నారు. మరోమారు ధర్నాల రూపంలో నిరసన తెలుపుతున్నామని, ఇప్పటికైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి భారత రాజ్యాంగ గ్రంథాన్ని పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో శివ, బలరాం, రామకృష్ణ, లక్ష్మణ్, అశోక్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

గోపాల్‌పేట: ప్రతిఒక్కరికీ రాజ్యాంగంపై అవగాహన కల్పించాలని, ఈ విషయంలో ప్రభుత్వం తప్పనిసరిగా చొరవ తీసుకుని అందరికీ రాజ్యాంగ గ్రంథాన్ని అందించాలని డీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వారు మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిని వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సునీతకు అందించారు. కార్యక్రమంలో ఆంజనేయులు, వెంకటయ్య, సాయి మహారాజ్, కిషోర్, హరీష్, తరుణ్, బాలపీరు, కుర్మయ్య, నీలయ్య తదితరులు పాల్గొన్నారు.

జములమ్మ ఆలయంలో పూజలు



పెద్దమ్మ తల్లికి బోనాలు తీసుకొస్తున్న మహిళలు

అమరచింత: పట్టణ శివారులో వెలసిన జములేశ్వరి మాత ఆలయంలో మంగళవారం భక్తులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా పూజలు నిర్వహించారు. ఏరువాక పున్నమి సమీపిస్తుండటంతో అమ్మవారు పుట్టింటికి చేరుకుంటుందని ఆయల కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయంలో అమ్మవారి విగ్రహానికి పవిత్రజలాలతో అభిషేకించి నైవేద్యాలను సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో పోటేళ్లు, కోళ్లు బలిచ్చి అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు. పట్టణానికి చెందిన నెల్లికొండి సురేందర్‌రెడ్డి ఆలయ ప్రాంగణంలో వంట గదుల కోసం రేకుల షెడ్‌లను ఏర్పాటు చేస్తామని ముందుకు వచ్చినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు మంగలి నరసింహులు తెలిపారు. గతంలో గర్భగుడిలో టైల్స్ వేసినట్లు వెల్లడించారు.

ఘనంగా పెద్దమ్మ బోనాలు..

గోపాల్ పేట: మండల కేంద్రంలో పెద్దమ్మ బోనాల పండుగను గ్రామస్తులు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం గోపాల్‌పేట ప్రజలు ఉదయం పది గంటల నుంచే పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ఇళ్ల వద్ద నుంచి ఆడపిల్లలు, మహిళలు బోనాలు తయారు చేసుకుని అమ్మవారి గుడి వద్ద బోనాలు సమర్పించి వారి మొక్కులు తీర్చుకున్నారు. గోపాల్‌పేటకు చెందిన భక్తులతో పాటు వారి బంధువులు అధిక సంఖ్యలో అమ్మవారి గుడిని దర్శించుకొని పూజలు చేశారు.

మదనాపురం: మండలంలోని దుప్పల్లిలో మంగళవారం పెద్దమ్మ పండగను గ్రామస్తులు ఘనంగా జరుపుకొన్నారు. ఉదయం నుంచి గ్రామంలో పండగ వాతావరణం కనిపించింది. బంధువులు, ఆడపడుచులు, స్నేహితుల రాకతో గ్రామమంతా సందడి నెలకొంది. పండగను పురస్కరించుకొని అమ్మవారి ఆలయాన్ని రంగులతో అలంకరించి శుద్ధి చేశారు. గ్రామంలోని అన్ని వీధుల గుండా మేళ తాళాలతో బోనాలను ఎత్తుకొని అమ్మవారి ఆలయానికి చేరుకోని నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



పూజలు చేస్తున్న భక్తులు



దుప్పల్లిలో బోనాలు ఎత్తిన మహిళలు

ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



అమరచింతలో ఓఆర్ఎస్ ప్యాకెట్లును పంపిణీ చేస్తున్న ఏఎన్ఎం, ఆశావర్కర్

సాక్షి ఎఫెక్ట్..

అమరచింత: వేసవి ఎండలు ముదురుతున్న వేళ ప్రజలు వడదెబ్బకు గురికాకుండా ఉపశమనం పొందేందుకు ఓఆర్ఎస్ ద్రావణం ఎంతో ఉపయోగపడుతుందని హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్ తెలిపారు. సాక్షి దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన 'అందుబాటులో లేని ఓఆర్ఎస్ ప్యాకెట్లు' అన్న కథనానికి వైద్య అధికారులు స్పందించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ శరత్ ఆదేశాలతో పట్టణంలోని ఆయా వార్డుల్లో ఆశా వర్కర్లు, ఆరోగ్య కార్యకర్తల ద్వారా బుధవారం ఇంటింటికీ వెళ్లి ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశామన్నారు. ప్రతి నిత్యం పట్టణంలోని అన్ని ఇళ్లకు వెళ్లి తమ సిబ్బంది ద్వారా ఓఆర్ఎస్ అందిస్తూ వాటిని సద్వినియోగం చేసుకోవాలని అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు రోహిళ, శారద తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

వనపర్తి టౌన్: శ్రీవాణి డిగ్రీ కళాశాల వార్షికోత్సవాన్ని మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి.సుదర్శన్‌రెడ్డి తెలిపారు. కళాశాల సెమిస్టర్ టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు మెడల్స్, ఇన్‌డోర్, ఔట్‌డోర్ గేమ్స్‌లో గెలుపొందిన విద్యార్థులకు మెమెంటోలు అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నతంగా ఎదగాలని, వారికి వారు మంచి గుర్తింపు తెచ్చుకోవడంతో పాటుగా తల్లిదండ్రులకు, గురువులకు సైతం మంచి పేరును తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు.

హరితహారానికి మొక్కలు సిద్ధం



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ నరసింహులు

పెబ్బేరు: హరితహారం నాటికి నాటేందుకు నర్సరీలో మొక్కలు సిద్ధంగా ఉండాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నరసింహులు సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం మండలంలో బూడిదపాడు గ్రామాన్ని సందర్శించి ఆయన మాట్లాడారు. పల్లెప్రకృతి కార్యక్రమంలో భాగంగా కమ్యూనిటీ ఇంకుడు గుంతల తవ్వకాలు ప్రారంభించిన అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, జీఎస్‌టీఏలు, ఐకేపీ వీఓఏలతో ఏర్పాటు చేసిన సమావేశం ఏర్పాటు చేశారు. తెలంగాణకు హరితహారం, శానిటేషన్, రాబోయే దశాబ్ది ఉత్సవాలు, తదితర అంశాలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యమ్మ, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఎంపీఓ, ఏపీఎం తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన..

కొత్తకోట రూరల్: ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో మండలంలోని వివిధ గ్రామాల్లో గల నర్సరీలోని మొక్కలు ఎండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పెద్దమందడి ఎంపీడీఓ అఫ్జల్ అన్నారు. మంగళవారం మండలంలోని జంగమాయపల్లి, బలిజపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను ఎంపీడీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నర్సరీల నిర్వాహకులతో మాట్లాడుతూ హరితహారం కార్యక్రమంలో అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేలా మొక్కలు సంరక్షించాలని ఆదేశించారు. ఉదయం, సాయంత్రం రెండు పూటల నీళ్లు పట్టాలని, వర్షాకాలం వచ్చే వరకు మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామాల్లో పర్యటించారు. పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

కేంద్ర పథకాలను ప్రజల్లో తీసుకెళ్లాలి



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న బీజేపీ నాయకులు

ఆత్మకూర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని చైతన్య పరిచే కార్యక్రమం గ్రామాల్లో నిర్వహిస్తున్నామని బీజేపీ ఫ్లోర్ లీడర్ అశ్విన్‌కుమార్ తెలిపారు. మండలంలోని పిన్నంచర్లలో బూత్ నంబర్ 220, 221లో బీజేపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఇంటింటికీ వివరించారు. ఈ సందర్భంగా రూపొందించిన వాల్‌పోస్టర్లు అతికించారు. కేంద్ర నిధులతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే పనులను కూడా బీఆర్ఎస్ నాయకులు తమ గొప్పతనంగా చెప్పుకుంటూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగేంద్రం, బ్రహ్మయ్య, భూపాల్‌యాదవ్, అశోక్‌నంద పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గడ్డి ట్రాక్టర్ దగ్ధం



విద్యుత్ తీగలు తగిలి మంటలు అంటుకున్న వరిగడ్డి ట్రాక్టర్

పెబ్బేరు: పట్టణ కేంద్రంలో 7వ వార్డులో షార్ట్‌సర్క్యూట్‌తో గడ్డిట్రాక్టర్ దగ్ధమైన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాలలో.. గద్వాల జిల్లా మానపాడు మండలం పోతులపాడు గ్రామానికి చెందిన మద్దిలేటి స్థానిక రైతుల నుంచి పశువుల మేతక కోసం ఒక ట్రాక్టర్‌కు రూ.8 వేలు చెల్లించి వరిగడ్డిని కొనుగోలు చేసి ఇతరులకు అమ్ముతూ వ్యాపారం చేస్తున్నాడు. ఇదే క్రమంలో మంగళవారం పాన్‌గల్ మండలం అన్నారం తండా నుంచి ట్రాక్టర్ వరిగడ్డిని కొనుగోలు చేసి పెబ్బేరు చెందిన రైతుకు అమ్మేందుకు తీసుకొస్తున్న సమయంలో దారిలో విద్యుత్ తీగలు తగిలి నిప్పురవ్వలు రావడంతో వరిగడ్డి అంటుకుంది. డ్రైవర్ వెంటనే అప్రమత్తమై ట్రాక్టర్ ట్రాలీ హైడ్రాలిక్‌తో గడ్డిని కిందకు పడేసి ఫైర్‌ఇంజిన్‌కు సమాచారం ఇవ్వడంతో అక్కడి చేరుకున్న సిబ్బంది మంటలు అదుపులోకి తెచ్చారు. దీంతో ట్రాక్టర్‌కు, కూలీలకు ఎలాంటి ప్రమాదం జరగలేదని తెలిపారు.

యువశక్తిని మేల్కొలిపేందుకు క్విజ్ పోటీలు



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న నాగరాజ్‌గౌడ్

ఆత్మకూర్: హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ స్ఫూర్తిగా తెలంగాణ యువశక్తిని మేల్కొలిపే దిశగా మున్సిపాలిటీలోని వికాస్ డిగ్రీ కళాశాలలో రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నామని టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజ్ గౌడ్‌అన్నారు. పట్టణంలోని వికాస్ డిగ్రీ కళాశాలలో మంగళవారం యూత్ డిక్లరేషన్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్లను విద్యార్థులతో కలిసి విడుదల చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతో విసిగిపోతున్న ప్రజలు రాబోయే రోజుల్లో అసమర్థ ప్రభుత్వాలను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి అయూబ్‌ఖాన్, తులసీరాజ్, నల్గొండ శ్రీనివాస్, గంగాధర్, షబ్బీర్, జహీర్, జాంగీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని అనకాయపల్లి పంచాయతీ పరిధిలోని గొరికుంట తండాకు చెందిన రాంబాబు(28) ఆర్థిక ఇబ్బందులతో ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితిని తండావాసులు టీఎమ్మార్ యువజన సభ్యుల ద్వారా పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డికి తెలియజేశారు. స్పందించిన మేఘారెడ్డి తక్షణ సహాయం కింద రూ.10వేలు పంపించాడు. ఆ నగదును మంగళవారం టీఎమ్మార్ యువజన సభ్యులు గొరికుంటతండాకు వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి నగదులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భారతీ తదితరులు ఉన్నారు.